


## భక్తులతో కిక్కిరిసిన కాళేశ్వరం

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ శాఖ ఏర్పాట్లు

6లో



www.aakshitha.com
People's voice
# అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
తెలంగాణ దిక్సూచి
సోమవారం । 01 । జూన్ । 2026



# పేట పట్టణ కాంగ్రెస్ "అధ్యక్ష పీఠం" ఎవరికో...?

- బిసి సామాజిక వర్గం వైపే
- అధిష్టానం మొగ్గు...!
- వర్గ పోరులో దక్కెదెవరికి...?
- యువత మద్దతు చూరగొన్న "శనగాని"ని వరించేనా....?



**సూర్యాపేట, అక్షిత ప్రతినిధి:** రాష్ట్రంలో సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల (ఎంపీటీసీ, జెడ్పీటీసీ)ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం వేగంగా రంగం సిద్ధం చేస్తున్న వేళ,కాంగ్రెస్ పార్టీలో సంస్థాగత పదవుల భర్తీ ప్రక్రియ ఊపందుకుంది. పార్టీ బలోపేతమే లక్ష్యంగా అధిష్టానం జిల్లాల వారీగా నూతన కమిటీల నియామకంపై కసరత్తు ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలో సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవి ఎవరిని వరిస్తుందనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. ఈ రేసులో బలమైన బీసీ నాయకుడు, పార్టీ విధేయుడిగా పేరుగాంచిన శనగాని రాంబాబు గౌడ్ పేరు సూర్యాపేటలో ప్రముఖంగా వినిపిస్తోంది.

మిగతా.. 2లో



## ప్రగతి పనులకు సీఎం రేవంత్ శ్రీకారం

- నేడు కుమ్రం భీం-ఆసిఫాబాద్ జిల్లాకు సీఎం రేవంత్ రెడ్డి
- రూ.112.14 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- విద్యుత్ మౌలిక సదుపాయాలు, సౌర విద్యుత్ ప్రాజెక్టు, మున్సిపల్ అభివృద్ధి పనులకు శ్రీకారం

**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సోమవారం కుమ్రం భీం-ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలో చేపట్టనున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. మొత్తం రూ.112.14 కోట్ల విలువైన

మిగతా.. 2లో

## అకాల వర్షం అపార నష్టం

- అకాల వర్షాలతో జొన్న రైతుల్లో ఆందోళన

**ఆదిలాబాద్, అక్షిత ప్రతినిధి:** ఆదిలాబాద్ జిల్లాలో అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జొన్న పంటను మార్కెట్ యార్డ్‌కి తీసుకువచ్చి రోజులు గడుస్తున్నా కొనుగోలు పూర్తి కాకపోవడం, పంటను తరలించడంలో అధికారులు విఫలం అవడంతో ప్రతి రోజు పంటను కాపాడుకోవడానికి మార్కెట్లో ఉన్నా కుప్పలవద్దనే నిద్రిస్తున్నామని, వర్షాలతో ఎక్కడ తడిసి పోతాయో అని జొన్న రైతులు ఆందోళన చెందుతున్నారు.

బోథ్ మండలం మార్లపెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కేంద్రం వద్ద ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో పాటు వర్షం కురవడంతో రైతుల పాదరాని పాట్లు పడ్డారు. అక్కడ ఏర్పాటు చేసిన టెంటు పడిపోవడం,

మిగతా.. 2లో



## 'రైతు డిస్కం'తో సాగుకు ఉరితాడు

- 24గంటల ఉచిత కరెంట్ ఇస్తేనే ఓట్లు అడుగుతానని సీఎం ప్రమాణం చేయాలి : హరీశ్ రావు
- సోలార్ పవర్‌తో 24 గంటల విద్యుత్ ఎలా సాధ్యం..? రేవంత్‌కు ప్రశ్న
- మూడో డిస్కంతో లిఫ్ట్ ఇరిగేషన్, మిషన్ భగీరథకు ముప్పు
- డిస్కంల అప్పులపై సీఎం వ్యాఖ్యలు అవాస్తవాలు
- ఆర్పీడీసీఎల్ నిర్ణయం వెనక్కి తీసుకోకపోతే విద్యుత్ ఉద్యమం చేపడతాం



**సిద్దిపేట, అక్షిత బ్యూరో:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 'రైతు డిస్కం' (టీజీఆర్పీడీసీఎల్) ఏర్పాటును బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా

మిగతా.. 2లో

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY

# పేట పట్టణ కాంగ్రెస్ "అధ్యక్ష పీఠం" ఎవరికో...?

(మొదటి పేజీ తరువాయి)

### సామాజిక సమీకరణాలు రాంబాబు గౌడ్ కే దక్కనుందా...?

సూర్యాపేట పట్టణంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకున్న తర్వాత నాయకుల్లో ఉత్సాహం రెట్టింపయింది. కాగా భవిష్యత్తు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సామాజిక సమీకరణాల పరంగా ఈసారి బలమైన బీసీ సామాజిక వర్గానికి పట్టణ అధ్యక్ష పదవి ఇవ్వాలనే డిమాండ్ గట్టిగా వినిపిస్తోంది. ఎందుకంటే ఇప్పటికే జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన గుడిపాటి నర్సయ్యను వరించగా, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా రెడ్డి వర్గానికి చెందిన కొప్పుల వేణారెడ్డి, వైస్ చైర్మన్ గా వైశ్య వర్గానికి చెందిన గట్టు శ్రీనివాస్ లను అధిష్టానం నిర్ణయించింది.కాగా సూర్యాపేట మున్సిపల్ చైర్ పర్సన్ పదవి కూడా వైశ్య వర్గానికి చెందిన మొరిశెట్టి నివేదిత లక్ష్మాది, మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి మైనారిటీ నాయకుడు షఫీ ఉల్లాలను ఎన్నుకున్న విషయం తెలిసిందే. పై సమీకరణాలను పరిశీలించిన నేపథ్యంలో పట్టణంలో బీసీ సామాజిక వర్గానికే పట్టణ అధ్యక్ష పదవి వరిస్తుందనేది బలంగా వినిపిస్తోంది.అయితే బీసీల్లో అనేక కులాలు ఉన్నప్పటికీ జనాభా ప్రాతిపదికను పరిశీలించడంతో పాటు పార్టీకి ఎంతకాలం సేవ చేశారనేది కూడా అధిష్టానం పరిశీలించడం పరిపాటియే. అందుకోసం అత్యంత కీలకమైన,బలమైన వర్గంగా ఉన్న గౌడ సామాజిక వర్గానికి ఈ పదవి కేటాయించడం పార్టీకి రాజకీయంగా ఎంతో లాభసాటిగా మారుతుందనేది కొందరు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకు గౌడ సామాజిక వర్గంలో మంచి పట్టు కలిగి, అందరినీ కలుపుపోయే గుణమున్న శనగాని రాంబాబు గౌడ్ అయితేనే పట్టణంలో పార్టీని మరింత బలోపేతం చేయగలరనేది క్షేత్రస్థాయి పరిశీలనలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు తెలిసింది.ఇదిలా ఉంటే ఇటీవలే జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో యువత మద్దతుతో పోటీ చేయాలనే పట్టుదలతో ఉండి, తను ఎంచుకున్న 7వ వార్డు రిజర్వేషన్ల ప్రకారం ఎస్సీ రిజర్వుడు కావడంతో పోటీలో నిలబడలేక పోయారు.

### యువతలో జోష్ పెంచిన నాయకుడు

రాంబాబు గౌడ్ కేవలం సామాజిక వర్గ సమీకరణాల పరంగానే కాకుండా,పార్టీ కష్టకాలంలో ఉన్నప్పటి నుంచి కాంగ్రెస్ జెండాను మోసిన వీర విధేయుడిగా పేరు తెచ్చుకున్నారు.కాంగ్రెస్ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేసిన సీనియార్టీ ఆయన సొంతం. వ్యాపారవేత్తగా, ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందిన ఆయన సూర్యాపేట పట్టణంతో పాటు చుట్టుపక్కల నాలుగు మండలాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్తగా క్లీన్ ఇమేజ్ కలిగి ఉంటూ,ప్రజల్లో నిరంతరం అందుబాటులో ఉండే నాయకుడిగా ఆయనకు పట్టుంది. పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ,బీసీ వర్గాలతో పాటు ముఖ్యంగా యువత, విద్యార్థులు, మేధావి వర్గం మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది. ఆయనకు ఈ పదవి ఇస్తే యువతలో కొత్త జోష్ వస్తుందని పార్టీ శ్రేణులు కూడా అభిప్రాయ పడుతున్నట్లు బహిరంగ ప్రదేశాల్లో వినిపిస్తోంది.

### రేసులో ఉన్నది వీరే....!

పట్టణ అధ్యక్ష పదవి కోసం రేసులో ఉన్న వారి పేర్లు అక్కడక్కడ వినిపిస్తున్నాయి. ప్రస్తుత పట్టణ అధ్యక్షుడు అంజద్ అలీ,31వ వార్డు కౌన్సిలర్ కొండపల్లి దిలీప్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ భద్రు,పట్టణ మాజీ అధ్యక్షులు అబ్దుల్ రహీం, సీనియర్ నాయకులు బెశీజారపు రమేష్ గౌడ్,48వ వార్డు కౌన్సిలర్ వెలుగు వెంకన్న లాంటి నేతలు పోటీ పడుతున్నట్లు సమాచారం.

కాగా పట్టణ కాంగ్రెస్ పగ్గాలు బీసీలకు అప్పగిస్తే సూర్యాపేటలో కాంగ్రెస్ పార్టీకి మరింత బలపడుతుందనేది వాదన వినిపిస్తోంది. అధిష్టానం కూడా ఇదే దిశగా సానుకూల నిర్ణయం తీసుకుంటుందని సూర్యాపేట ప్రజలు,పార్టీ కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా అధిష్టానం నిర్ణయం వెలువరించే వరకు వేచి చూడక తప్పదు.



# అకాల వర్షం అపార నష్టం

(మొదటి పేజీ తరువాయి)

జొన్న కుప్పలపై ఉన్న పారిలపై నీరు నిలిచి పోవడం జరిగింది, అధికారుల నిర్లక్ష్యం వల్ల తూకం వేసిన పంటను తరలించడం లో జాప్యం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు అకాల వర్షాల వల్ల జొన్న పంట తడిసి పోతే దానికి ఎవరు బాధ్యత తీసుకుంటారని రైతులు ప్రశ్నిస్తున్నారు.

# ప్రగతి పనులకు సీఎం రేవంత్ శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టనున్నారు.

ఈ పర్యటనలో భాగంగా చింతలమానేపల్లి మండలంలోని కౌటాల (రవీంద్రనగర్ క్యాంపు నం-2) గ్రామంలో ఏర్పాటు చేయనున్న 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.56.55 కోట్లు.రెబ్బెన మండలం నంబాల గ్రామంలో రూ.6 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న సౌర విద్యుత్ ప్లాంట్ పనులకు కూడా సీఎం శంకుస్థాపన చేయనున్నారు.

అదే విధంగా చింతలమానేపల్లి, గుడ్లబోరి, కాపువాడ, చింతకుంట, అంకుషాపూర్ ప్రాంతాల్లో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాల



పనులకు కూడా ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనున్నారు. ఈ ఉపకేంద్రాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మరింత బలోపేతం కావడంతో పాటు వ్యవసాయం, పరిశ్రమలు, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందుబాటులోకి రానుంది.జిల్లాలోని ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో రూ.15 కోట్లతో చేపట్టనున్న తొమ్మిది అభివృద్ధి పనులు, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో రూ.18.70 కోట్లతో చేపట్టనున్న ఎనిమిది అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు.

ఈ కార్యక్రమాల ద్వారా జిల్లాలో విద్యుత్ మౌలిక సదుపాయాల విస్తరణ, పునరుత్పాదక ఇంధన వినియోగ ప్రోత్సాహం, పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి జూపల్లి తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాట్లు పూర్తయ్యాయని చెప్పారు.

# 'రైతు డిస్కం'తో సాగుకు ఉరితాడు

(మొదటి పేజీ తరువాయి)

వ్యతిరేకించారు. సిద్దిపేట క్యాంప్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించడానికే ఈ సంస్థను ఏర్పాటు చేస్తున్నామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్--8 ప్రకారం రైతు డిస్కంకు అధికంగా పునరుత్పాదక ఇంధన విద్యుత్‌ను కేటాయించనున్నట్లు పేర్కొన్నారని, సోలార్ విద్యుత్ పగటి వేళల్లో మాత్రమే అందుబాటులో ఉంటుందని హరీశ్ రావు అన్నారు. అలాంటప్పుడు రైతులకు 24 గంటల విద్యుత్ ఎలా అందిస్తారో ముఖ్యమంత్రి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తేనే ఎన్నికల్లో ఓట్లు అడుగుతానని సీఎం బహిరంగంగా ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. మూడో డిస్కం ఏర్పాటుతో కాళేశ్వరం, దేవాదుల, నెట్టెంపాడు, కల్వకుర్తి, భీమా, కోయిల్ సాగర్, సీతమ్మ సాగర్ వంటి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వహణకు ఇబ్బందులు తలెత్తుతాయని ఆయన పేర్కొన్నారు. వరదల సమయంలో రాత్రింబవళ్లు మోటార్లు నడపాల్సిన అవసరం ఉంటుందని, పగటి వేళల్లో మాత్రమే విద్యుత్ అందితే సాగునీటి ప్రాజెక్టుల పనితీరు దెబ్బతింటుందని చెప్పారు. అలాగే మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరాపైనా ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. డిస్కంల అప్పుల విషయంలో ముఖ్యమంత్రి చేస్తున్న ఆరోపణలను కూడా హరీశ్ రావు ఖండించారు. బీఆర్ఎస్ పాలనలో పదేళ్ల కాలంలో ప్రభుత్వం డిస్కంలకు రూ.27 వేల కోట్లు బకాయి పడిందని, సగటున ఏడాదికి సుమారు రూ.2 వేల కోట్లు మాత్రమేనని తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్వల్ప కాలంలోనే రూ.25,284 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని, ఏడాదికి సగటున రూ.10 వేల కోట్లకు పైగా అప్పుల భారాన్ని మోపిందని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర విద్యుత్ వ్యవస్థను గణనీయంగా విస్తరించామని హరీశ్ రావు పేర్కొన్నారు. సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల సామర్థ్యాన్ని భారీగా పెంచి తెలంగాణను విద్యుత్ రంగంలో స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. రైతు డిస్కం ఏర్పాటును ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.. లేకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున విద్యుత్ ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.

# ఖమ్మంలో మాదిగ భవన్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని మంత్రి తుమ్మలకు వినతి

### తెలంగాణ మాదిగ హక్కుల దండోరా టీఎంహెచ్డీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్

**ఖమ్మం/అక్షిత బ్యూరో :**

ఖమ్మం జిల్లా కేంద్రంలో మాదిగ భవనానికి స్థలము నిర్మాణానికి నిధులు కేటాయించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కి వినతి పత్రం అందజేసిన తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్. ఖమ్మం జిల్లాలో అత్యధిక శాతం జనాభా కలిగిన



మాదిగలకు మాదిగ భవన్ నిర్మిస్తే జిల్లాలో మాదిగ జనాభా ఫంక్షన్లకు స్టడీ సర్కిల్ ఏర్పాటు ద్వారా విద్యార్థులకు యువతకు అందుబాటులో ఉండటం వలన విద్యా నైపుణ్యత కోసం కుటుంబ అవసరాలైన ఫంక్షన్లు చేసుకోవడం కొరకు శుభ కార్యాలు జరుపుట కొరకు ఎంతో ఉపయోగపడుతుందని మాదిగ జాతీయ అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేశారని ఖమ్మంలో తుమ్మల కృషితో మాదిగ భవన్ నిర్మించుటకు నిధులు కేటాయించి మాదిగ భవన నిర్మాణానికి కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో టీఎంహెచ్డీ రాష్ట్ర జిల్లా నాయకులు కనకపుడి వీరస్వామి మునగలేటి వీరస్వామి ఆదూరి బాలకృష్ణ పిల్లిగుండ్ల ముత్తయ్య నగర కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కుక్కల రామకృష్ణ ఆర్కే నగర ప్రధాన కార్యదర్శి పగిడి బుక్కుల విజయ్ కుమార్ కాంపాటి ఉపేందర్ వెంకయ్య బాబు బొడ్డు గురవయ్య జంగం వెంకయ్య నందకుమార్ పాపారావు మహేష్ వెంకన్న వెంకట్ నారాయణ ఆదూరి రామారావు రవి మధు గోపి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా నెలరోజుల పాటు

# పోలీస్ యాక్ట్ అమలు

### అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు, ధర్నాలకు నిషేధం

### ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: ఎస్పీ డా. జానకి షర్మిల

**నిర్మల్, అక్షిత బ్యూరో:** జిల్లాలో శాంతిభద్రతలు, ప్రజా ప్రశాంతత పరిరక్షణ దృష్ట్యా జూన్ 1 నుండి జూన్ 30, 2026 వరకు జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ తెలిపారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఐఏఎస్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఈ నిబంధనలు అమలులోకి వస్తాయని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్న కాలంలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి లేదా ఇతర ఉన్నత పోలీస్ అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఎటువంటి బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, ధర్నాలు నిర్వహించ రాదని ఎస్పీ స్పష్టం చేశారు. అలాగే కత్తులు, చాకులు, కర్రలు, జెండా కర్రలు, దుడ్డుకర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు తదితర నిషేధిత ఆయుధాలను వెంట తీసుకెళ్లడం, వినియోగించడం పూర్తిగా నిషేధమని తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా జనసమూహాలు గుమికూడడం, బహిరంగ సమావేశాలు నిర్వహించడం కూడా నిషేధిత చర్యల కిందకు వస్తాయని పేర్కొన్నారు. రాళ్లు నిల్వ చేయడం, వాటిని వెంట తీసుకెళ్లడం, లౌడ్‌స్పీకర్లు, డీజే సౌండ్ సిస్టమ్‌ల వినియోగం కూడా ఈ కాలంలో అనుమతించబడదని ఎస్పీ వెల్లడించారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై 30 పోలీస్ యాక్ట్-1861 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలందరూ పోలీస్ శాఖకు సహకరించి శాంతిభద్రతల పరిరక్షణకు తోడ్పడాలని ఎస్పీ డా.జి. జానకి షర్మిల విజ్ఞప్తి చేశారు.



## రాష్ట్రస్థాయి శిక్షణలో మెరిట్ సాధించిన

# మంచిర్యాల యోగాసన ప్రతినిధులు

### మంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా సర్టిఫికెట్ల అందజేత

**మందమర్రి, అక్షిత ప్రతినిధి:** తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిద్దిపేటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కోచ్ అండ్ జడ్జిల శిక్షణ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా ప్రతినిధులు విశేష ప్రతిభ కనబరిచి మెరిట్ సర్టిఫికెట్లు అందుకున్నారు.నాలుగు రోజులపాటు నిర్వహించిన ఈ సమగ్ర శిక్షణా కార్యక్రమంలో రాష్ట్రంలోని సుమారు 25 జిల్లాల నుంచి యోగాసాధకులు, క్రీడాకారులు పాల్గొన్నారు. శిక్షణ అనంతరం నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణులైన మంచిర్యాల జిల్లా



ప్రతినిధులు తమ ప్రతిభను చాటుకున్నారు.మాస్టర్ ట్రైనర్లుగా రోహిత్, గీతాదేవి, రాహుల్, వైష్ణవి, హర్షిణి ఎంపిక కాగా, ట్రైనీ కోచ్-కమ్-జడ్జిలుగా అర్హత సాధించిన వారికి రాష్ట్ర మంత్రి టీ. హరీష్ రావు చేతుల మీదుగా మెరిట్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా యోగాసన రంగంలో మంచిర్యాల జిల్లా ప్రతినిధులు సాధించిన ఈ విజయంపై జిల్లా యోగాసన స్పోర్ట్స్ సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ, ఉత్తీర్ణులైన వారిని అభినందించారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో కూడా ప్రతిభ కనబరిచి జిల్లాకు మరింత గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# మత సామరస్యమే ప్రజా ప్రభుత్వ విధానం

- రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి
- అన్ని మతాల ఆత్మగౌరవం సంస్కృతి పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలం అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం
- కూసుమంచి శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం (గణపేశ్వరాలయం) పునర్నిర్మాణ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి



**ఖమ్మం/అక్షిత బ్యూరో:**

మత సామరస్యమే ప్రజా ప్రభుత్వ విధానమని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.కూసుమంచి మండల కేంద్రంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం (గణపేశ్వరాలయం) పునర్నిర్మాణ అభివృద్ధి పనులకు రూ.3 కోట్ల 30 లక్షల 50 వేల వ్యయంతో ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ లతో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. కొన్ని రాజకీయ పార్టీలు దేవుళ్ల మతాల పేరుతో రాజకీయాలు చేస్తున్నాయని అయితే ప్రజా ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ మత సామరస్యానికి ప్రతీకగా పనిచేస్తోందన్నారు.ప్రతి మతం యొక్క ఆత్మగౌరవం సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు అవసరమైన సహకారం అందిస్తున్నామని చెప్పారు. ఇటీవల సమ్మక్క- సారలమ్మ జాతరను అత్యంత ఘనంగా నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోందన్నారు.

గత ప్రభుత్వం భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి వంద కోట్లు ఇస్తామని ప్రకటించినప్పటికీ ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదని విమర్శించారు.

ప్రస్తుత ముఖ్యమంత్రి భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి 350 కోట్లతో పనులకు శంకుస్థాపన చేశారని, మరో వారం నుంచి పది రోజుల్లో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.గోదావరి పుష్కరాల నాటికి యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. భద్రాచలం ఆలయ పరిసర ప్రాంతాల్లో భూసేకరణ కోసం ఇప్పటికే 68 కోట్లు వ్యయం చేసినట్లు చెప్పారు.బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి ప్రాంతాలు అన్ని దేవాలయాలు అభివృద్ధికి మొత్తం వెయ్యి కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. అందులో భాగంగానే గణపేశ్వరాలయం అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. దేవాలయాలతో పాటు చర్చిలు మసీదుల అభివృద్ధికి కూడా ప్రజా ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తోందన్నారు.ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ గణపేశ్వరాలయం ప్రాంత ప్రజల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన ఆధ్యాత్మిక క్షేత్రమని అన్నారు. 3 కోట్ల 30 లక్షల వ్యయంతో చేపట్టిన ఆలయ అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయ అభివృద్ధితో భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందడంతో పాటు ఆధ్యాత్మిక పర్యాటకానికి కూడా ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ పాలేరు నియోజక వర్గంలో రహదారులు విద్య దేవాలయాలు ఆసుపత్రులు తదితర అన్ని రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఇటీవల సమ్మక్క-సారలమ్మ జాతర అభివృద్ధి పనులను స్వల్ప వ్యవధిలోనే విజయవంతంగా పూర్తి చేసినట్లుగానే గణపేశ్వరాలయం అభివృద్ధి పనులను కూడా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత గడువులోగా పూర్తి చేస్తామని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనుల అమలును నిరంతరం పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ డీఈ ఏఈలు డీపీఓ రాంబాబు ఆర్డీఓ శ్రీనివాస్ తహసీల్దార్ సైదులు సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు స్థానిక నాయకులు సర్పంచులు అర్చకులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.






# స్పెయిన్ అతిథులకు ఆరాధన ఆయుర్వేద కేంద్రంలో విశేష ఉపశమనం

### డాక్టర్ రాజా రెడ్డి ఆధ్వర్యంలో చికిత్సలు

### భారతీయ సంస్కృతి, యోగా, పంచకర్మ అనుభవంతో మంత్రముగ్ధులైన విదేశీయులు

**నిర్మల్ అక్షిత బ్యూరో, మే 31:**
భైంసా పట్టణంలోని ఆరాధన ఆయుర్వేద వెల్‌నెస్ అండ్ రీసెర్చ్ సెంటర్‌కు చికిత్స కోసం వచ్చిన స్పెయిన్ దేశానికి చెందిన ఇద్దరు అతిథులు ఆయుర్వేద వైద్యం ద్వారా విశేష ఉపశమనం పొందినట్లు కేంద్ర నిర్వాహకులు తెలిపారు. ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ రాజా రెడ్డి మరియు వారి బృందం అందించిన వైద్య సేవలతో వారు ఎంతో సంతృప్తి వ్యక్తం చేశారు. చికిత్సలతో పాటు తమ నివాస కాలంలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను దగ్గరగా అనుభవించే అవకాశం వారికి లభించింది. సంప్రదాయ భారతీయ ఆహారాన్ని ఆస్వాదించడంతో పాటు భారతీయ వంటకాలను తయారు చేయడం నేర్చుకున్నారు.

అలాగే యోగా, ప్రాణాయామం, పంచకర్మ చికిత్సలు మరియు పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ఆరోగ్యపరంగా, మానసికంగా ఎంతో ఉల్లాసాన్ని పొందారు. ఈ సందర్భంగా వారు సరస్వతి దేవి ఆశీస్సులు కూడా పొందడం తమ ఆరోగ్య యాత్రకు ఆధ్యాత్మిక అనుభూతిని జోడించిందని పేర్కొన్నారు. కేంద్రంలో లభించిన ఆతిథ్యం, సానుకూల వాతావరణం, ప్రశాంతమైన పరిసరాలు తమను ఎంతో ఆకట్టుకున్నాయని వారు తెలిపారు. విదేశీ అతిథుల సంతృప్తి, ఆనందం తమకు మరింత ప్రేరణనిస్తోందని, ప్రపంచవ్యాప్తంగా ఆయుర్వేద మహత్యాన్ని చాటేందుకు కృషి కొనసాగిస్తామని డాక్టర్ రాజా రెడ్డి మరియు ఆరాధన ఆయుర్వేద కేంద్రం బృందం పేర్కొన్నారు.





# గడువులోగా ధాన్యం కొనుగోలు పూర్తవ్వాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**పంట అవశేషాల కాల్చివేతపై రైతులకు అవగాహన కల్పించాలి**

**వరంగల్, అక్షిత బ్యూరో:** నైరుతి రుతుపవనాల రాక నేపథ్యంలో రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని గడువులోగా పూర్తిగా సేకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.ఆదివారం ఖానాపూర్ మండలంలోని మనుబోతుల తండా, పెద్దమ్మగడ్డ తండా, ఖానాపూర్ మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందర్శించి పరిశీలించారు.

ఈ సందర్భంగా ధాన్యం సేకరణ పురోగతి, రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలు, హమాలీల అందుబాటు తదితర అంశాలపై ఆరా తీశారు.కొనుగోలు కేంద్రాల వద్ద రైతులతో మాట్లాడిన కలెక్టర్, ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు.

హమాలీల కొరత ఉందని రైతులు చెప్పడంతో కొనుగోలు పూర్తయిన కేంద్రాల నుంచి హమాలీలను అవసరమైన కేంద్రాలకు తరలించి సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రైతులకు పంట అవశేషాల కాల్చివేత వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలను వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం తగ్గిపోవడంతో పాటు నేలలోని సూక్ష్మ జీవులు నశించి భూమి సారవంతత దెబ్బతింటుందని తెలిపారు. దీని ప్రభావం భవిష్యత్తులో పంట దిగుబడులపై పడుతుందని, రైతులు పంట అవశేషాలను కాల్చకుండా ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించాలని సూచించారు.

ఖానాపూర్ మండలంలోని శ్రీనివాసరావు రైస్ మిల్, సాయి కృష్ణ రైస్ మిల్, గోపీకృష్ణ ఆగ్రో ఏజెన్సీలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ధాన్యం బస్తాల నాణ్యత, బరువు, రికార్డులు, రసీదులను పరిశీలించారు.

ఈ సందర్భంగా రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా తూకాలు సక్రమంగా నిర్వహించాలని, ధాన్యం స్వీకరణలో పారదర్శకత పాటించాలని మిల్లర్లకు సూచించారు.

రైతుల ప్రయోజనాలకు భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు.ఈ సందర్భంలో అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి, నర్సంపేట ఆర్డిఓ ఉమారాణి, సంబంధిత శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# మియాపూర్‌లో ఘనంగా నిర్వహించిన ఈపిఎల్ సీజన్-3 బహుమతి ప్రదానోత్సవం

**శేరిలింగంపల్లి అక్షిత ప్రతినిధి:** సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ క్రికెట్ అకాడమీ, యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మియాపూర్‌లోని నీలిమా గ్రీన్స్‌లో నిర్వహించిన ఈ పి ఎల్ సీజన్-3 బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెట్టి కుసుమకుమార్ , ఏ ఐ సి సి కార్యదర్శి, కె జి ఎఫ్ వ్యవస్థాపకులు ,అధ్యక్షులు, ఒడిశా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, వి.జగదీశ్వర్ గౌడ్ శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ , టి పి సి సి ప్రధాన కార్యదర్శి, చందన్‌ఇండియన్ క్రికెట్ ప్లేయర్ హాజరై కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన జట్లు, రన్నరప్ జట్లు మరియు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆటగాళ్లకు ట్రోఫీలు, మెడల్స్ , ప్రశంసా పురస్కారాలను అందజేశారు. అలాగే మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, బెస్ట్ బ్యాట్స్‌మన్, బెస్ట్ బౌలర్, బెస్ట్ ఫీల్డర్, ఎమర్జింగ్ ప్లేయర్ అవార్డులను విశేష ప్రతిభ, క్రమశిక్షణ , క్రీడాస్ఫూర్తి ప్రదర్శించిన క్రీడాకారులకు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ యువతలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం మరియు పోటీతత్వ స్ఫూర్తిని పెంపొందించడంలో క్రీడల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. యువ క్రికెటర్లకు ఉత్తమ వేదికను కల్పిస్తూ క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ క్రికెట్ అకాడమీ, యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ సేవలను ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో విశేష కృషి చేసిన యలమంచి ఉదయ్ కిరణ్ , యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, చైర్మన్, మనస్ ముత్తవరపు , సి వో ఈ సి క్రికెట్ అకాడమీ వ్యవస్థాపకులు, అలాగే కోచ్‌లు దివాకర్, విష్ణులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.




ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అభిషేక్ గౌడ్ , కావూరి ప్రసాద్ , కట్ల శేఖర్ రెడ్డి , రవీందర్ రెడ్డి , నడిమింటి కృష్ణ , అశోక్ , శ్రీ మూర్తి, రావిపాటి వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, బాబ్జీ , సత్యనారాయణ , సాంబయ్య , సాయి కృష్ణ , రవి కుమార్, బాల సరస్వతి , నర్సింలు , విజయలక్ష్మి, నరేందర్, చంద్రమౌళి, రావిపాటి కోటేశ్వరరావు, రఘునాథ్, గోపీనాథ్, సుబ్బారాయుడు , రమణ , శరత్ , సంజయ్, వినోద్, కృష్ణ, వాసు, భార్గవ్ , ఉదయ్, తేజ, రామ్, నాని, సుబ్బారావు , రామ్మోహన్, వైభవ్, నవీన్ , నిశాంత్, దివాకర్ , గిరి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. అలాగే పెద్ద సంఖ్యలో కాలనీ వాసులు, తల్లిదండ్రులు, క్రీడాకారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, క్రీడాభిమానులు, శ్రేయోభిలాషులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అందరి సహకారం, భాగస్వామ్యం ఈ కార్యక్రమానికి మరింత ప్రత్యేకతను తీసుకువచ్చింది.చివరగా విజేతలకు ట్రోఫీలు, బహుమతులు అందజేయడంతో పాటు ఘనమైన సంబరాల మధ్య కార్యక్రమం ముగిసింది.

# ఐఐఐటీ బాసరలో సీట్ సాధించిన ఎన్‌సీసీ క్యాడెట్ పి.ఉదయశ్రీ

**వలిగొండ/ అక్షిత న్యూస్:** వలిగొండ మండలంలోని లోతుకుంట మోడల్ స్కూల్ విద్యార్థిని, ఎన్‌సీసీ క్యాడెట్ పి. ఉదయశ్రీ ఐఐఐటీ బాసర ప్రథమ దశ ప్రవేశ ఫలితాలలో ఎన్‌సీసీ కోటా ద్వారా సీటు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డా. సీతారామరాజు తెలిపారు.పాఠశాలలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిక్షణ విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు మానసిక, శారీరక దృఢత్వాన్ని కలిగిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఎన్‌సీసీ ద్వారా విద్యార్థులు విద్యా రంగంలో కూడా విశేష ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం ఆసక్తి గల విద్యార్థులు నేరుగా కళాశాలను సంప్రదించాలని కోరారు.అలాగే, 6వ తరగతి ప్రవేశాల కోసం మోడల్ స్కూల్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థులు 8వ తరగతి నుండి ఎన్‌సీసీలో చేరేందుకు అర్హులవుతారని, ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా పి. ఉదయశ్రీని పాఠశాల ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ అధికారులు, తల్లిదండ్రులు అభినందించారు.




# నగర పొరులను, ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్న హిజ్రాలు

**యూనివర్సిటీ పోలీసులు దృష్టి పెట్టాలి**

**వరంగల్, అక్షిత బ్యూరో:** కాకతీయ యూనివర్సిటీ జంక్షన్ పరిసర ప్రాంతాల్లో కొందరు హిజ్రాలు బస్సుల్లోకి ఎక్కి ప్రయాణికులను డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. ఈ రోజు ఆదివారం మధ్యాహ్నం సుమారు 1.30 గంటల సమయంలో ఓ కుటుంబం బస్సులో ప్రయాణిస్తుండగా, డబ్బులు ఇవ్వాలని బలవంతం చేయడంతో పాటు అసభ్యకరంగా మాట్లాడారని బాధితులు ఫోన్ ద్వారా ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం.

ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం, రూ.20 ఇచ్చినా తీసుకోకుండా మరింత డబ్బు 100, 200 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేయడం, నిరాకరిస్తే అనుచిత వ్యాఖ్యలు చేయడం వల్ల మహిళలు, కుటుంబ సభ్యులు అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా యూనివర్సిటీ పోలీసులు స్పందించి సంబంధిత వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బస్సు ప్రయాణికుల భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని కాకతీయ యూనివర్సిటీ జంక్షన్ పరిసర ప్రాంతాల్లో పర్యవేక్షణ పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ట్రాన్స్‌జెండర్ సమాజానికి చెందిన ప్రతి ఒక్కరినీ ఒకే కోణంలో చూడకూడదని, కొందరి ప్రవర్తన వల్ల మొత్తం వర్గంపై అపోహలు ఏర్పడకుండా అధికారులు, ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సామాజిక వర్గాలు సూచిస్తున్నాయి.

# లక్ష్మాపురంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**రామన్నపేట, అక్షిత ప్రతినిధి:** రామన్నపేట మండలంలోని లక్ష్మాపురం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1998- 99 ఏడవ తరగతి బ్యాచ్కు చెందిన పూర్వ విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు.



ఈ సందర్భంగా నాడు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులు వెంకటేశ్వర్, ఆంజనేయులు లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల కాటమరాజు, బత్తిని ఆంజనేయులు, ముక్కాముల స్వామి యాదవ్, బొడిగె ఆంజనేయులు, చెరుకు మురళి, జె కుమార్, వరలక్ష్మి, శోభ, లక్ష్మి, ధనమ్మ తదితరులు ఉన్నారు.



# అంగన్వాడీ విద్యార్థులకు యూనిఫామ్స్ (దుస్తులు) పంపిణీ

### గ్రామ సర్పంచి అతినారపు శివకుమార్

**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** ప్రజాపాలనలో భాగంగా లింగాల మండలం రాంపురం గ్రామంలో అంగన్వాడి సెంటర్ లో అంగన్వాడి టీచర్ పుష్పలత అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో గ్రామ సర్పంచి




శివకుమార్. మరియు ఉపసర్పంచి గుద్దటి కృష్ణయ్య పాల్గొని అంగన్వాడిలో చదువుతున్న ప్రీస్కూల్ చిల్డ్రన్‌కు ప్రభుత్వం ద్వారా సరఫరా అయినటు వంటి దుస్తులు యూనిఫామ్స్ అంద జేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న మూడు నుండి ఐదు సంవత్సరాలలో పిల్లలందరూ అంగన్వాడి సెంటర్ కు పంపించాలని సెంటర్లో ప్రభుత్వం ద్వారా పౌష్టికాహారం అందజే యడం జరుగుతుందని మధ్యాహ్నం భోజనంతో పాటు గుడ్డు అందజేయడం జరుగుతుందని తెలిపారు.


. ప్రీ స్కూల్ సెంటర్ లో నమోదైన విద్యార్థులకు ఆటపాటలతో విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రమ వార్డు సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సమీకృత జిల్లా కార్యాలయం పనులు త్వరగా పూర్తి చేయాలి

### మొక్కలు,చెట్లను నాటి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలి

### జిల్లా కలెక్టర్ సత్య శారద

**వరంగల్, అక్షిత బ్యూరో:** ఆదివారం ఉదయం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద 'ఓ సిటీ ' లో నిర్మాణంలో ఉన్నా జిల్లా సమీకృత కార్యాలయ సమూదాయాన్ని సందర్శించారు.ఈ సందర్శనకు వరంగల్ తహసీల్దార్



శ్రీకాంత్ ,సంబంధిత అధికారులు ,కాంట్రాక్టర్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.అనంతరం సంబంధిత అధికారులను కాంట్రాక్టర్లను నిర్మాణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని, త్వరలో అందుబాటులోకి రానున్న సమీకృత జిల్లా కలెక్టరేట్ సముదాయాన్ని మొక్కలు కొన్ని అందమైన చెట్లును నాటడం ద్వారా ఇంకా సుందరీకరణగా తీర్చిదిద్దాలన్నారు.

# భౌతిక తెలంగాణ కాదూ సామాజిక తెలంగాణ లక్ష్యంగా సుదీర్ఘ పోరాటం

### -తెలంగాణ ఏర్పడినా సాకారం కాని కలలు

### -మరో పోరాటానికి సమాయత్తం అవుతున్న ఉద్యమకారులు

### -బత్తుల సోమయ్య



**ఖమ్మం/అక్షిత బ్యూరో:** దశాబ్దాల పాటు జరిగిన పోరాటాలు ఉద్యమాలు కేవలం భౌతిక తెలంగాణ కోసం కాదని సామాజిక తెలంగాణ కోసమే అని సుదీర్ఘ పోరాటాలు సాగాయని ప్రస్తుతం ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా తెలంగాణ ప్రజల కలలు ఏమాత్ర సాకారం చెందలేదు. ఈ సమయంలో మరో పోరాటానికి తెలంగాణ ఉద్యమకారులు సమాయత్తం అవుతున్నారు. 1956 నాటి సమయంలో భాష ప్రాతిపాదికన పై ఆంధ్రా ప్రాంతంలో తెలంగాణ ను విలీనం చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్ అవతరించిందని ఈ ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు ముందు ఫజల్ అలీ కమీషన్ చెప్పినా వినకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పచ్చజెండా ఊపారు. దక్కన్ ప్రాంతంలో హైదరాబాద్ సంస్థానం తన ప్రత్యేక భాష సంస్కృతి సాంప్రదాయం అస్తిత్వం అంశంలో ఒక ప్రత్యేకత కలిగి ఉన్న ఆంధ్ర విలీనంతో వీటి ఉనికికి బీటలు వారడం ప్రారంభమైంది.తెలంగాణ ప్రజలు వీరోచిత పోరాటానికి ప్రసిద్ధులు. తెలంగాణలో నిజాం కాలంలో జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఇందుకు మంచి ఉదాహరణ ఆంధ్ర- తెలంగాణ విలీనంతో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెద్ద మనుషుల ఒప్పందం అమలు కాకుండా కొందరి కుట్రలు కారణంగా మరికొందరు వివక్షతల ప్రవర్తన మూలంగా తెలంగాణ పోరాటం ఉద్యమం ఆవిర్భవించింది.

అనేక దశాబ్దాల పాటు సాగిన ఈ పోరాటం ఉద్యమం సందర్భంగా అంతర్ లీనంగా మన ఉద్యోగాలు మన నిధులు మన నియామకాలు మన నీళ్లు ప్రధాన అంశాలుగా తెరపైకి వచ్చాయి. ఆంధ్రా లాబీ ఈ పోరాటాలను ఉద్యమాలను తీవ్రంగా అణచివేస్తూ వచ్చాయి. స్వరాష్టం కోసం 1200 మంది బలిదానాలు చేసుకుంటే చూడలేక ఎట్టకేలకు సోనియా గాంధీ మూలంగా ఆ నాటి యూపీఏ ప్రభుత్వం 2014 జూన్ 2 న తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు మొగ్గు చూపింది. అప్పటికి కూడా ఆంధ్రా లాబీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడకుండా శత విధాలుగా ప్రయత్నాలు సాగించింది. పార్లమెంట్ లో కూడా అడ్డుకోవడానికి తెగించింది. ఆకరికి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. తొలి రెండు దఫాలు టీఆర్ఎస్ (బీఆర్ఎస్)తెలంగాణ ప్రభుత్వ పాలక పార్టీగా వ్యవహరించింది. నిన్నటి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ లో ప్రభుత్వాన్ని ఏర్పరచింది. సుమారు 13 సంవత్సరాలు కావస్తోంది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భవించి తెలంగాణ ప్రజల ఆకాంక్షలు వారి కలలు తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించినప్పటికీ నెరవేరక పోవడం విచారకరం. తెలంగాణ పోరాటాన్ని ఉద్యమాన్ని పరిహసించడమే కాకుండా వ్యతిరేకించడంతో పాటు దాడులు చేసినవారు దాడులు చేయించిన వారు ఆ నాటి తెలంగాణ ద్రోహులు గత ప్రభుత్వంలోను నేటి ప్రభుత్వంలో మంత్రులుగా కీలకమైన ఇతర పదవులలో కొనసాగుతుండడం మన దౌర్భాగ్యం. తెలంగాణ ఏర్పాటులో ప్రజలకు కదిలించడంలో వారిని అవగాహన పేర్చడంలో నిత్యం పోరాట యోధులుగా వ్యవహరించిన కీలక పాత్రధారులు మన తెలంగాణ ఉద్యమకారులు. ఈ ఉద్యమకారుల అంశంలో తొలి అధికారపార్టీ ప్రస్తుత అధికార పార్టీలు ఇచ్చిన హామీల విషయంలో చిత్తశుద్ధి గాని ఏ విధమైన హామీ ఇచ్చామని ఇంగితం కూడా లేకుండా వ్యవహరించడం అత్యంత గర్హనీయ విషయం. తొలిసారి 1969వ దశకంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆమరణ నిరాహార దీక్షలు ప్రారంభం కావడం ఇక్కడే తొలి ప్రాణత్యాగం కూడా జరగడం.ఆ నాటి పోరాటం ఉద్యమం సందర్భంగా 300పై చిలుకు ప్రాణాలు కోల్పోవడం మలి దశ పోరాటంలో కూడా ఇదే విధంగా కొందరు తెలంగాణ కోసం అమరులు అవ్వడం జరిగాయి. ఇలాంటి త్యాగాలు చేసిన లేదా అమరులైన వారి కుటుంబాలకు తొలిదశ ఉద్యమంలో మిగిలి ఉన్న కొందరికి మలి దశ సందర్భంగా ఇంకా ఆశలు పెట్టుకుని బ్రతుకులు ఈడుస్తున్న ఉద్యమకారులకు తెలంగాణ ఫలాలు దక్కక పోవడం. ఇదే తెలంగాణను అణచడానికి ఏ నాడు జై తెలంగాణ అని కూడా అనని వారికి ఈ రెండు పార్టీలు అందలం ఎక్కించడం నేపథ్యంలో తెలంగాణ ఉద్యమకారులు మరో పోరాటానికి ఉద్యమానికి సమాయత్తం కావల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ నాడు టీఆర్ఎస్ గెలుపులో ప్రస్తుత కాంగ్రెస్ గెలుపులో ప్రధాన పాత్రధారులు తెలంగాణ ఉద్యమకారులు. వీరి విషయంలో ఆ నాటి ప్రభుత్వం ఈ నాటి ప్రభుత్వం కూడా నిర్లక్ష్య దోరణి వహించడం తల్లిపాలు తాగిన రొమ్మునే గుద్దడం వంటిది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధనే లక్ష్యంగా సాగిన పోరాటాలు ఉద్యమాలు, త్యాగాలు ఆత్మ బలిదానాల స్ఫూర్తితో మన తెలంగాణ ఉద్యమకారులు మరో పోరాటానికి సిద్ధం కాకుంటే మన హక్కులు నెరవేర్చబడవు. కాబట్టి మరోసారి జరిగే పోరాటం ఉద్యమంలో తెలంగాణ ఉద్యమకారులకు అన్ని వర్గాల ప్రజలు సంఘీభావం తెలపాలి. అప్పుడే సామన్య ప్రజల కలలు సాకారం చెందుతాయి. సామాజిక తెలంగాణ బంగారు తెలంగాణ ఏర్పడుతుంది. బడుగు బలహీన వర్గాలకు రాజకీయ సామాజిక సాధికారత లభ్యమవుతుంది.

# ఏఎల్యూకేఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెస్పి జీవో కాపీల దగ్ధం

### రైతులకు ద్రోహం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడండి..

### అఖిల భారత ఐక్య రైతు సంఘం పిలుపు...

**లోకేశ్వరం, అక్షిత న్యూస్ :**

నిర్మల్ జిల్లా సంయుక్త కిసాన్ మొర్చా దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఆదివారం రోజు లోకేశ్వరం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని పంట ధాన్యం ఆరబోసే కల్లం



వద్ద,ఏఎల్యూకేఎస్(అఖిల భారత ఐక్య రైతు సంఘం)ఆధ్వర్యంలో ఎమ్మెస్పి ఆర్డర్ కాపీలను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా అఖిల భారత ఐక్య రైతు సంఘం ఉమ్మడి ఆదిలాబాద్,నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి



మాట్లాడుతూ..

రైతులకు లాభదాయక ధరలు ఇస్తున్నట్లుగా ధరల కమిషన్ వాదిస్తుంది ఇది ఎంత మాత్రం వాస్తవం కాదు.ఎమ్మెస్పి ప్రకటించే ముందు రైతులు పెట్టిన పెట్టుబడిని ఏమాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదు,స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం సి2ం 50% కలపాల్సి ఉండగా నామమాత్రపు ఖర్చులను పరిగణనలోకి తీసుకుని ఎంఎస్పి ని నిర్ణయించడం స్వామినాథన్ సిఫార్సులను పక్కన పెట్టడం దుర్మార్గమైన విషయం.దేశవ్యాప్తంగా నరేంద్రమోడీ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ,సి2ం50% నిర్ణయించాలని ఎస్.కెఎమ్ తరపున డిమాండ్ చేశారు .

నరేంద్ర మోడీ రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఏఎల్యూకేఎస్ జిల్లా కోశాధికారి చాంద్ పాషా,రైతులు రవి రావు, సాయన్న,పాల్గొన్నారు...


# భక్తులతో కిక్కిరిసిన కాళేశ్వరం

## భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ శాఖ ఏర్పాట్లు



**అక్షిత ప్రతినిధి, భూపాలపల్లి:**
సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా ఆదివారం కాళేశ్వరానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చిన నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు..

ఆదివారం కాళేశ్వరంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పర్యటించారు..పుష్కరాలు ముగింపు దశకు చేరుకోవడం,చివరి ఆదివారం కావడంతో సరస్వతి అంత్య పుష్కరాలకు వచ్చే భక్తుల







సంఖ్య పెరిగింది..వారికి తగినట్లు ఏర్పాట్లు ఉన్నాయో లేవో అని ఎస్పీ పరిశీలించారు..

ఈ సందర్భంగా దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన క్యూ లైన్లలోని భక్తులను ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పర్యవేక్షించారు..పుష్కర ఘాట్, త్రివేణి సంగమం వద్ద భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో డ్రోన్ సహాయంతో పరిస్థితి ఎలా ఉందో తెలుసుకున్నారు..భక్తుల వాహనాలకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు.. అనంతరం ఎస్పీ గోదావరి నదిలో బోట్ లో ప్రయాణించారు..ప్రజలు లోతైన ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు..



# కార్ డ్రైవర్లకు అండగా కాంగ్రెస్ పార్టీ

### మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

### తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి

**సూర్యాపేట , అక్షిత ప్రతినిధి:**
కార్ డ్రైవర్లకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన డ్రైవర్ నవిలె మహేష్ కుటుంబ సభ్యులకు డ్రైవర్ ల యూనియన్ పక్షాన రూ.1 లక్ష 40 వేలు, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి రూ.10 వేలు, జిల్లా కాంగ్రెస్ నాయకులు షేక్ ఫారూఖ్ రూ.5 వేలు,కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ముదిరెడ్డి రమణారెడ్డి రూ.2 వేలు కలిపి మొత్తంగా రూ.1 లక్ష 57 వేలు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో డ్రైవర్ల అందరూ గ్రూప్ ఇన్సూరెన్స్,జీవిత బీమా వంటి సంస్థల్లో ఇన్సూరెన్స్ లు కలిగి ఉంటే అట్టి కుటుంబాలకు భరోసాగా ప్రమాద భీమా వర్తిస్తుందని తెలిపారు.రోడ్డుపై ప్రయాణించేటప్పుడు జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని డ్రైవర్ లకు సూచించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్,డిసీసీ కార్యదర్శి నేరెళ్ల మధు గౌడ్,జిల్లా కాంగ్రెస్ నాయకులు.వల్దాస్ దేవేందర్, తండు శ్రీనివాస్ గౌడ్,బైరబోయిన శ్రీనివాస్,సర్పంచ్ భూక్యా రాజు, సూర్యాపేట,నకిరేకల్, హయత్ నగర్,విజయవాడ,ఫోర్ వీలర్స్ కారు డ్రైవర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు రహిత సమాజం నిర్మిద్దాం

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు

**వరంగల్, అక్షిత బ్యూరో:** ప్రపంచ నో టొబాకో డే కార్యక్రమము ఎంజీఎం నర్సింగ్ కళాశాల వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.




ఈ సందర్భంగా డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ ప్రపంచంలో పొగాకు వాడటం వలన ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయి వాటిని అరికట్టే బాధ్యత ప్రతి పౌరుడు అవగాహన చేసుకుని ఆరోగ్యవంతంగా జీవించాలని కోరినారు.

వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది వివిధ శాఖల సమన్వయంతో పొగాకు వాడడం వలన వచ్చే సమస్యల పైన ప్రజలకు అవగాహన కల్పించడంలో ముందు వరుసలో ఉండాలని తెలిపినారు.

ఎన్సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఇక్తాదర్ అహ్మద్ మాట్లాడుతూ పొగాకు వాడేవారు దాని వలన సంభవించే ఆరోగ్య సమస్యలపై వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సహాయంతో అవగాహన చేసుకుని దానికి సరి అయిన పరీక్షలు చికిత్సలు చేయించుకోవాలని కోరినారు. మానసిక నిపుణులు డాక్టర్ భరత్ మాట్లాడుతూ డ్రగ్ పదార్థాలు స్మోకింగ్ హ్యాబిట్స్ గుట్కాలు, నమలే వారు ఏదో టైంలో వ్యాధికి గురి అవుతారని తెలిపినారు. వ్యాధిగ్రస్తులు 144 16 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి వైద్యుల సలహా ప్రకారం తగిన చికిత్సలు చేసుకొని ఆరోగ్యవంతంగా జీవించాలని కోరినారు. కార్యక్రమంలో విజయ, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేటలో.. అండర్ గ్రౌండ్ పనులపై కలెక్టర్ ఆగ్రహం

### సమగ్ర కార్యాచరణ ప్రణాళికకు ఆదేశం

**సూర్యాపేట, అక్షిత ప్రతినిధి:**
సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ పనుల నిర్వహణ తీరుపై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో ప్రజారోగ్య శాఖ, మున్సిపల్ అధికారులు,కాంట్రాక్ట్ ఏజెన్సీ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ప్రజారోగ్య శాఖ ఆధ్వర్యంలో కెఎన్ఆర్ కన్స్ట్రక్షన్ లిమిటెడ్ సంస్థ చేపడుతున్న పనుల పురోగతిని ఈ సందర్భంగా ఆయన పరిశీలించారు.



### పనుల జాప్యంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి

సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పట్టణంలో యూజీడీ పనులు అత్యంత నిర్లక్ష్య పూర్వకంగా కొన సాగుతున్నాయని మండిపడ్డారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజి పైపులు, మ్యాన్‌హోల్‌ల నిర్మాణం కోసం రోడ్లను తవ్వేసి,నెలల తరబడి వాటికి సిమెంట్ కాంక్రీట్ పనులు చేయకుండా వదిలేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.దీనివల్ల సాధారణ ప్రజలు,వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ట్రాఫిక్‌కు పెద్ద ఎత్తున అంతరాయం కలుగుతోందని గుర్తు చేశారు.పైపులైన్లు,మ్యాన్‌హోల్‌ల నిర్మాణం పూర్తయిన వెంటనే తవ్విన గోతులను పూడ్చక పోవడం ముమ్మాటికీ నిర్లక్ష్యమేనని, తవ్వకాల సమయంలో దెబ్బతిన్న తాగునీటి పైపులైన్లు,ఇతర ప్రజా వినియోగ సదుపాయాలను సకాలంలో పునరుద్ధరించక పోవడం వల్ల ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడాల్సి వస్తోందని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు.

పనుల్లో వేగం పెంచడంతో పాటు ప్రజల ఇబ్బందులను తక్షణమే తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు.యూజీడీ పనులు చేపట్టిన అన్ని ప్రాంతాల్లో సీసీ రోడ్ల పునరుద్ధరణకు సంబంధించి రోడ్డు వారీగా వివరాలు,టైం లైన్‌తో యాక్షన్ ప్లాన్‌ను వెంటనే సిద్ధం చేయాలని ఆదేశించారు.

ప్రజారోగ్య శాఖ,కాంట్రాక్ట్ ఏజెన్సీ సమన్వయంతో పని చేసి, దెబ్బతిన్న మౌలిక వసతులను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని, మున్సిపల్ అధికారులు కూడా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో నల్గొండ ప్రజారోగ్య శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి,మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిరణ్ కుమార్, ప్రజారోగ్య శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లు అనిల్ కుమార్,రమాదేవి,కేఎన్ఆర్ కన్స్ట్రక్షన్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# అంబటిపల్లి విద్యార్థుల ప్రభంజనం

### ఆర్మీ మెరిట్ లిస్ట్‌లో 4 మంది విద్యార్థులు ఆర్మీకి ఎంపిక

### శుభాకాంక్షలు తెలియజేసిన గ్రామ ప్రజలు

**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** ఇటీవల విడుదల అయిన ఆర్మీ మెరిట్ లిస్ట్‌లో అచ్చంపేట నియోజకవర్గంలోని లింగాల మండలం అంబటిపల్లి గ్రామానికి చెందిన 4 మంది విద్యార్థులు ఇండియన్ ఆర్మీకి ఎంపిక అయ్యారు. వారు ఎంపిక కావడం చాలా గర్వంగా ఉంది..ఏ కోచింగ్ సెంటర్ కి వెళ్లకుండా సొంత ఊర్లోనే...కష్టపడి ఉద్యోగాలు సాధించాలి అనుకోవడం శ్రద్ధ పెట్టి ఇండియన్ ఆర్మీలో సెలెక్ట్ కావడం జరిగింది. ఇండియన్ ఆర్మీలో ఎంపికైన వారు గ్రామానికి చెందిన దేశెట్టి ఆనంద్,శ్రీకాంత్,హేమాద్రి,కురుమూర్తి. గ్రామ ప్రజలు మాజీ డిప్యూటీ సర్పంచి జనార్ధన్‌తో పాటు ప్రజలు మరియు బంధుమిత్రులు. స్నేహితులు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఎస్ఐఆర్ అవగాహన సదస్సులో మాజీ మంత్రి పోతుగంటి రాములు

**అచ్చంపేట అక్షిత ప్రతినిధి:**
అచ్చంపేట పట్టణంలోని బీకే ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన ఎస్.ఐ.ఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) అవగాహన సదస్సులో





మాజీ మంత్రి పోతుగంటి రాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బి.ఎల్.ఏ-2లతో సమావేశమైన ఆయన ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, ఓటరు నమోదు, సవరణల ప్రక్రియలో అనుసరించాల్సిన విధానాలపై సూచనలు చేశారు. పార్టీ బలోపేతానికి అనుసరించాల్సిన వ్యూహాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ప్రతి కార్యకర్త కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, సమగ్రత కోసం కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# కాంగ్రెస్ ముదిరాజులకు ఇచ్చిన హామీని నిలబెడుతుంది

### ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర జ్ఞానేశ్వర్ ..

**శేరిలింగంపల్లి, అక్షిత ప్రతినిధి:**
కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజులకు ఇచ్చిన హామీని నిలబెడుతుందని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బోర జ్ఞానేశ్వర్ అన్నారు. తెలంగాణ ఐక్య ముదిరాజ్ శేర్లింగంపల్లి నియోజకవర్గం ఖానా మెట్ శాఖ పదవి వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ లో ముదిరాజులకు బిసి - డి నుండి బిసి ఏలో చేర్చే ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసిందని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ బిసి సమాజంలో మొదటి వరుసలో ఉన్న ముదిరాజులు రాజకీయంగా ఇంకా వెనుకబడి ఉన్నారని ముదిరాజులకు మంచి అవకాశం కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం ముదిరాజులకు ఎలాంటి మేలు చేయలేదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ కుటుంబ సర్వే నిర్వహించి తెలంగాణలో ఉన్న వివిధ సామాజిక వర్గాల స్థితిగతులపై సమగ్ర నివేదిక ఇచ్చిందని ఆయన తెలిపారు. ఆ నివేదిక ప్రకారం సామాజిక వర్గాల అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన తెలిపారు. ముదిరాజ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివయ్య ముదిరాజ్ మాట్లాడుతూ జనాభా లెక్కల ప్రాతిపదికన తెలంగాణ ప్రభుత్వం ముదిరాజు లెక్కన చూపించడం చాలా సంతోషకరమైన విషయమని అదే విధంగా




ముదిరాజ్ వెనుకబడిన వర్గానికి చెందిన వ్యక్తులకు ప్రభుత్వం వెనువెంటనే పథకాలను ప్రవేశపెట్టి వారి అభివృద్ధికి కృషి చేయాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్, శేర్లింగంపల్లి కాంగ్రెస్ ఇన్చార్జి జగదీష్ గౌడ్,ఖానా మెట్ శాఖ అధ్యక్షులు కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఆలయ కమిటీ అధ్యక్షులు సతీష్ ముదిరాజ్, రాష్ట్ర నాయకులు వివిధ ముదిరాజ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



# పకృతి ప్రేమికుడు రాసమొల్ల చంద్రయ్య

### "నల్లమల మొగ్గలు రాసమొల్ల రత్నావళి" పుస్తకాలు ఆవిష్కరణ

### ప్రముఖ సాహితీవేత్త, న్యాయవాది బెక్కెం జనార్దన్

**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:**
నల్లమల పకృతి ప్రేమికుడు కవి రాసమొల్లచంద్రయ్య అని ప్రముఖ న్యాయవాది సాహితివెత్త బెక్కెం జనార్దన్ అన్నారు. ఆదివారం లింగాల మండలం అప్పాయిపల్లి గ్రామంలో నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో రాసమొల్ల చంద్రయ్య రచించిన "నల్లమల మొగ్గలు, రాసమొల్ల రత్నావళి" మణిపూసలు పుస్తకాలను బెక్కెం జనార్దన్ ఆవిష్కరించారు.

కవి ఇంటిదగ్గర అప్పాయిపల్లి గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సభకు నెలపొడుపు సాహిత్య వేదిక ప్రదానకార్యదర్శి వహీద్ ఖాన్ సభాధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరై బెక్కం జనార్దన్ మాట్లాడుతూ అప్పాయిపల్లి గ్రామంలో ఆధిపత్యానికి వ్యతిరేకంగా జరిగిన ధిక్కార స్వరంలో బాలుడుగా ఉన్న రాసమొల్ల చంద్రయ్య పాల్గొన్నాడని ఆనాటినుండి ఈనాటి వరకు ప్రజలకోసం సమాజ మార్పుకు మొగ్గలు మణిపూసల కవిత్వం ద్వారా వెలుగెత్తి చాటుతున్నాడని ఆ అక్షరాలు ధిక్కార స్వరాన్ని వినిపిస్తున్నాయని చంద్రయ్యని కొనియాడారు.

ప్రశ్నించె తత్వం ఎల్లప్పుడూ సమాజంలో ఉంటుందని ఆ ప్రశ్ననే కవిత్వం లో కనపరుస్తూ చంద్రయ్య వినిపిస్తున్నాడని చెప్పారు. చంద్రయ్య తనకు ఈ కవిత్వం పుస్తకాలను అంకితం ఇవ్వడం గొప్పగా భావిస్తున్నానని రాబోయే కాలంలో మరిన్ని సమాజమార్పు కోసం తన కవిత్వం ద్వారా గళమెత్తాలని కోరారు.

అనంతరం కవి బోలయాదయ్య, కవి ఆశీర్వాదం నల్లమల మొగ్గలు రాసమొల్ల రత్నావళి కవిత్వాలను సమీక్షించి మాట్లాడుతూ

అణగారిన వర్గాలకు అక్షరాన్నాందించిన సావిత్రీ బాయి ఫూలే శ్రమ పోరాట తాత్వికతను నల్లమల సౌందర్యం,దేశభక్తులు, రైతులు చెట్లు, మహిళలు, పిల్లలు చెరువులు నదులు సైనికులు ,అమ్మానాయన ,స్వామి వివేకానంద,మొదలగు సామాజిక అంశాలపై కవిత్వం రాయడం అభినందనీయమని అన్నారు.రాసమొల్ల చంద్రయ్య దివ్యాంగుడైనా శక్తినంత కూడదీస్కోని సమసమాజ మార్పుకై అక్షరాన్ని సృష్టించడం గొప్పవిషయమని అన్నారు. అప్పాయిపల్లి గ్రామం నుండి దశాబ్దం కాలంగా మొగ్గలు కవిత్వం రాస్తున్న చంద్రయ్య గతంలో నల్లమల ఆరాద్య దైవం "సళేశ్వరం లింగమయ్య" పై పాటలను "దివ్యాంగుల మణిపూసలు" రచించాడు.

జీవితంలోని అనేక పార్శ్వాలతో వచ్చిన కవిత్వాన్ని ఆస్వాదిద్దామని నల్లమల అస్తిత్వాన్ని అక్షరీకరించడం గొప్ప విషయమని రాసమొల్ల చంద్రయ్య అప్పాయిపల్లి వెలుగని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మూడవత్ విజయ కృష్ణనాయక్ , భీంపల్లి శ్రీకాంత్, వడిచర్ల సత్యం, వనపట్ల సుబ్బయ్య గంటామనోహర్ రెడ్డి, ఆశీర్వాదం, కందికొండ మోహన్, ఎదిరెపల్లి కాశన్న, కల్వకోల్ మద్దిలేటి,నల్లగొండ శ్రీనివాస్, కేపి.లక్ష్మి నరసింహ్మ,దేవరపాగ కృష్ణయ్య,నిరంజన్ బాలయ్య లింగస్వామి మల్లేష్ బాలమ్మ, కవిత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.





# అంత్యపుష్కరాలను ఏటీఎంగా మార్చుకున్న మంత్రి శ్రీధర్‌బాబు

**కాళేశ్వర ఆలయ ప్రతిష్టను దిగజార్చుతున్న దుద్దిళ్ల దంపతులు**

**40లక్షల భక్తులఅంచనాతో చిరువ్యాపారులకు నష్టం**

**గోదావరి పుష్కరాల్లోనైనా దోపిడి లేకుండా ఈ ప్రాంత ప్రతిష్ట పెంచాలే**

**- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**




**అక్షిత ప్రతినిధి భూపాలపల్లి:**
ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నమని చెప్పుకునే సరస్వతీ అంత్య పుష్కరాలు దుద్దిళ్ల కుటుంబానికి ఏటీఎంగా ఉపయోగపడుతున్నాయని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. మహదేవ్ పూర్ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం క్షేత్రంలో సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ –శైలజ దంపతులు పుష్కర స్నానం ఆచరించి శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు..అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వర క్షేత్రంలో నిర్వహించిన ఆది పుష్కరాల్లో ఏ దోరణి అవలంబించారో అదే దోరణి అంత్యపుష్కరాల్లో అవలంబించారని అన్నారు. ఆది పుష్కరాల్లో ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు ఖర్చు చేసిన దానిని ఆర్‌టీఐ ద్వారా ఎంత ఖర్చు చేసిండ్లు దేనికి ఖర్చు చేసిండ్లని అడిగితే కనీసం లెక్కలు చూపించడం లేదని, దేవాదాయ శాఖ ఎంత డబ్బు వెచ్చిందని అడిగితే చూపించకుండా సుప్రీంకోర్టు గైడ్ లైన్స్ ఉన్నాయని వివరాలు చెప్పకూడదంటున్నారన్నారు. ఆలయ ఆస్తులు ఎన్ని ఉన్నయి డబ్బులు ఎంత ఉందన్నది చెప్పకూడదని సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్‌లో ఉంది కానీ చేసిన ఖర్చు చెప్పకూడదని ఎక్కడ లేదన్నారు. ఆడిట్ లేని డబ్బును ఎక్కువగా నొక్కేయవచ్చన్నదే వారి ఆలోచన అని ఆయన అన్నారు. ఈనాడు మంత్రి సతీమణి శైలజారామయ్యర్ దేవాదాయ శాఖ కమీషనర్‌గా ఉండి ఇక్కడ డబ్బు ఏవిధంగా నొక్కెయాలనే ఆలోచనలో ఉన్నట్లుగా కనబడుతుందన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో పాటు అధిక మాసం కావడంతో హిందువులు ఈ మాసంలో పూజలు పుణ్యస్నానాలు చేయరని వారికి తెలుసునని, అయినా రూ.30కోట్లు వెచ్చించి వాటిని పూర్తిగా మింగేసినట్లుగా తాను భావిస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ వేసిన టెంట్లు షామియానాలు ఎండోమెంట్ నుంచే పెడుతారని, వాటికి అడిట్ ఉండదని అడిగినా చెప్పరన్నారు.

అంత్యపుష్కరాలకు 40లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేశారని, గొప్పగా ప్రచారం చేయడంతో చిరు వ్యాపారులు పుష్కరాల్లో కొంత ఆదాయం పొందవచ్చని పెద్ద ఎత్తున సామగ్రిని తెచ్చి పెట్టుకున్నారని, కానీ ఇప్పటి వరకు భక్తులు రాక ఐదుశాతం కూడా వ్యాపారం జరుగలేదని తలలు పట్టుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరు కూడా ఆర్థికంగా బలపడకుండా ఆర్థికంగా క్షీణించిపోయే పనులు చేస్తున్నారని ఆయన ఆసహనం వ్యక్తం చేశారు. అంత్య పుష్కరాల్లో విఐపీలకు కల్పించిన సౌకర్యాలు సామాన్యులకు కల్పించలేదని, తెప్పోత్సవం, హారతీ కార్యక్రమాలు చేస్తున్నారని, అయితే ఎవరైనా విఐపీ వస్తున్నారంటే సామాన్యులు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. వీఐపీలపై చూపించిన శ్రద్ద సామన్యులకు చూపించకపోవడం వల్ల ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారని, మొదటి రోజే మంథని బస్టాండ్‌లో హైదరాబాద్‌నుంచి వచ్చిన భక్తులకు బస్‌సౌకర్యాలు లేక ఇబ్బంది పడ్డారని ఆయన గుర్తు చేశారు. భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించకుండా నోట్లు దండుకోవడానికే కార్యక్రమాలు చేస్తున్నారని, సాయంత్రం వేళలో లైటింగ్ పెట్టి షోపుటప్‌లు చేస్తున్నారని, ఇప్పటి వరకు సరస్వతీ అమ్మవారిపై మండపం పూర్తి చేయలేదని, రోడ్లు పనులు కాలేదన్నారు. బార్యాభర్తలు కాళేశ్వరంను ఏటీఎంలా మార్చుకుని వేల



కోట్లు ఇక్కడే సంపాదించుకుంటున్నారని, ఓట్లు వస్తే నోట్ల సంచుల కోసం అనేక రకాల దోపిడీలు చేస్తున్నారని ఆరోపించారు. ఆఖరుకు దేవుడి వద్ద కూడా దోచుకుంటూ కాళేశ్వరం ప్రతిష్టను దిగజార్చుతున్నారని ఆయన అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అని చెప్పుకునే వాళ్లు ఇన్‌ఫర్మేషన్ ఎందుకు ఇస్తలేదని, తాను స్వయంగా ఆర్‌టీఐ పెట్టిన జవాబు ఇవ్వడం లేదన్నారు. అయితే వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలు రాబోతున్నయని అప్పటికైనా దుద్దిళ్ల దంపతులు దోపిడి ఆపాలని, ప్రజల కోసం ఈ ప్రాంత ప్రతిష్ట, కాళేశ్వర ఆలయ ప్రసిద్ది పెంచడానికి పని చేయాలని ఆయన ఈ సందర్బంగా డిమాండ్ చేశారు..

# మోరీలు తీశారు... ఎత్తడం మరిచిండ్రు

**రోగాల బారిన పడుతున్న గ్రామస్థులు**



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:**
నాగర్ కర్నూల్ జిల్లా తాడూర్ మండలం యాదిరెడ్డి పల్లి గ్రామం లో మోరీలు తీసి ఆ చెత్తను ఎత్తడం మరచిపోయిన్రని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.గ్రామంలో పలు వార్డుల్లో మోరీ తీసిన చెత్త ఎంతకపోవడంతో దుర్వాసన వెదజల్లి గ్రామస్తులు రోగాల బారిన పడుతున్నారు. పలు మార్లు గ్రామ పంచాయతీ సిబ్బందికి చెప్పిన పట్టించుకోలేదని విమర్శలు వస్తున్నాయి. గ్రామ పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ సమస్య పై ద్రుష్టి సారించి మోరీలు తీసిన చెత్తను ఎత్తలని గ్రామస్థులు కోరుతున్నారు.

# పదవీ విరమణ పోందిన పోలీసులను సత్కరించిన అధికారులు

**వరంగల్, అక్షిత బ్యూరో:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ విభాగంలో సుధీర్ఘ కాలంగా విధులు నిర్వహించి ఆదివారం పదవీ విరమణ చేస్తున్న పోలీస్ అధికారులను పరిపాలన విభాగం అదనపు డిసిపి రవి ఘనంగా సత్కరించారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పరిపాలన విభాగానికి చెందిన ఆదనపు డిసిపి తో పాటు ఇతర పోలీస్ అధికారులు పదవీ విరమణ చేసిన ఎస్.ఐ యం. డి నజీర్, ఆర్. ఎస్. ఐ రవికుమార్, ఏ. ఆర్.ఎస్. ఐ లు రమేష్ ,



మల్లారెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు నారాయణ, అశోక్‌లను ఆధికారులను పూలమాల వేసి, శాలువ కప్పి ఘనం సత్కరించి జ్ఞాపిలను అందజేశారు. ఈ సందర్భంగా ఆదనపు డిసిపి మాట్లాడుతూ పదవీ విరమణ పోలీస్ ఆధికారులు అనంతరం కుటుంబ సభ్యులతో గడపాలని, ఏదైన సేవ కార్యక్రమాల్లో పాల్గొనాలని, ముఖ్యంగా పదవీ విరమణ అనంతరం ప్రభుత్వ ప్రయేజనాల ద్వారా వచ్చే డబ్బు ఏవరికి అప్పుగా ఇవ్వకుండా జాగ్రత్తగా తమ కుటుంబాల అవసరాల కోసం వినియోగించుకోవాలని ఆదనపు డిసిపి తెలిపారు. ఈ కార్యక్రమములో ఏ. ఆర్ ఆదనపు డిసిపి సురేష్ కుమార్ , శ్రీనివాస్, ఏసీపీలు నాగయ్య, ఆంతయ్యా, ఆర్. ఐ లు సతీష్, శ్రీధర్ , ఆర్. ఎస్. ఐ శ్రావణ్ కుమార్ తో పాటు పదవీ విరమణ చేసిన పోలీస్ అధికారుల కుటుంబ సభ్యులు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సూపర్‌స్టార్ కృష్ణ 83వ జయంతి వేడుకలు

**నిరుపేద విద్యార్థినికి పుస్తకాలు, విద్యా సహాయం అందజేత**

**సత్తుపల్లి, అక్షిత న్యూస్:**
సూపర్ స్టార్ కృష్ణ 83వ జయంతిని పురస్కరించుకొని మహేష్ బాబు అభిమానుల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సూపర్ స్టార్ కృష్ణ చిత్రపటానికి పూలమాలలువేసినివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలను జరుపుకున్నారు. అనంతరం సూపర్ స్టార్ కృష్ణ – మహేష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు లేని నిరుపేద విద్యార్థిని, 8వ తరగతి చదువుతున్న శ్రీ శరణ్యకు పుస్తకాలుఅందజేశారు.అదేవిధంగా విద్యార్థిని విద్యాభ్యాసానికి అవసరమైన ఫీజును కూడా మహేష్ బాబు ఫౌండేషన్ తరఫున అంద








జేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

సమాజ సేవతో పాటు విద్యార్థులకు అండగా నిలవడం సూపర్ స్టార్ కృష్ణ, మహేష్ బాబు ఆశయమని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అభిమాన సంఘ నాయకులు కోటమర్తి వెంకటేశ్వరరావు, రాంబాబు, శ్రీరామమూర్తి, చంద్రశేఖర్, సత్యనారాయణ, పాల్గొన్నారు. అలాగే విజయవాడ నుంచి మహేష్ బాబు ఫౌండేషన్ ప్రతినిధి సారథి, రబ్బాని హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఫౌండేషన్ సభ్యులు, అభిమాన సంఘ సభ్యులు సంఖ్యలో పాల్గొన్నారు.